www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 నవంబర్ 2025

నేడు ద్రౌపదిముర్ము రాక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటనలో భాగంగా తిరుపతి, తిరుమలకు రానున్నారు. రాష్ట్రపతి పర్యటించే ప్రాంతం మొత్తాన్ని ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు. తిరుమల, తిరుపతిలో పర్యటించే ప్రాంతాల్లో షాపులు, ఇతర వ్యాపార సంస్థలను పరిరోజులుగా మూసేయించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, జెసినవ్ ఈవో వెంకయ్యచౌదరి తిరుమల పర్యటించి భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. ఢిల్లీ నుంచి నేరుగా విమానంలో తిరుపతి విమానాశ్రయానికి గురువారం సాయంత్రం 3.20కి చేరుకుంటారు. అక్కడనుంచి నేరుగా కారులో 4.20 గంటలకు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని 5.20 గంటలకు తిరుమలకు బయల్దేరి వెళతారు. 6 గంటలకు పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వరాహస్వామిని, 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తిరుపతి, తిరుమల పోలీసు కనుసన్నల్లో గత పదిరోజులుగా ఉంది.

కేన్సర్ మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తోంది.. కాలుష్య ప్రభావం కొన్నాళ్ల పాటే ఇంటికొక కేన్సర్ పేషంట్ ఉన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.. 2024లో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ ఎనిమిది నెలల కాలంలో 120-140 మందికి కేన్సర్ చికిత్స అందిస్తే, 2025లో గడిచిన పది నెలల కాలంలోనే 450 నుంచి 500 మందికి చికిత్స అందించారు. రుయా ఆస్పత్రిలోని మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ ద్వారా నెలకు 50 కిమోథెరపీలు, 15-20 సర్జరీలు జరుగుతున్నాయి. రూ.20 కోట్లు వెచ్చించి కొత్త యంత్రాలు అందించి, నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురాగలిగితే నెలకు 2వేల మందికి రేడియోథెరపీ అందుబాటులోకి తీసుకురావచ్చు. అయితే నిధుల లేమి నిర్లక్ష్యం ఈ డిపార్టుమెంటును వెంటాడుతోంది. స్విమ్స్, టాటాకేన్సర్‌లో యంత్రాలు ఉన్నా పరీక్ష చేయించుకోవాలంటే మూడు నెలల సమయం వేచి చూడాల్సిందే. ఈలోపు కేన్సర్ 'స్టేజ్' దాటిపోతే ప్రమాదపు అంచుల్లోకి రోగి ఉండే పరిస్థితి.

కేన్సర్ మహమ్మారి 'మూడింతలు'

- 2024లో 140 మందికి చికిత్స
- రేడియోథెరపీ యంత్రమే లేదు
- పరీక్షకు మూడు నెలలు ఆగాల్సిందేనా...
- 2025లో పది నెలల్లో 500 మంది
- రూ.20 కోట్లు వెచ్చించలేని దుస్థితి
- రుయా ఆంకాలజీపై పాలకుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ఎస్‌వియుకి అనుబంధంగా ఉన్న రుయాకు 2500 పైగా పిజి, ఎంబిబిఎస్ వైద్య విద్యార్థులు, వందలాది మంది పారామెడికల్, నర్సింగ్ విద్యార్థులు సామర్థ్యం ఉన్నా కేన్సర్‌కు పూర్తిస్థాయి చికిత్స అందించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవడం విచారకరం. కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లు ఆహార అలవాట్లు, విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం, మత్తు పదార్థాల వాడకం వల్ల కేన్సర్ మహమ్మారి విజృంభిస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నడుం బిగించినా, ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం. దీంతో కేన్సర్ మహమ్మారి రోజురోజుకూ విజృంభిస్తోంది. రాయలసీమకే తలమానికమైన రుయాకు సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకకు చెందిన వారు, రాయలసీమతో పాటు, నెల్లూరు జిల్లావాసులు సైతం వైద్య చికిత్సల నిమిత్తం వస్తుంటారు. అయితే ఇంత పెద్ద ఆస్పత్రిలో అంకాలజీ పూర్తిస్థాయిలో చికిత్స అందించలేని దుస్థితి. రాయలసీమలో ప్రభుత్వ ఆధీనంలో కేన్సర్‌కు చికిత్స అందించే సౌలభ్యం ఉన్న ఆస్పత్రులు రెండే. ఒకటి కర్నూలు, రెండు తిరుపతి రుయా. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కేన్సర్‌కు వైద్యం అందించే అవకాశం ఉన్న ఆస్పత్రులు ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి ఐదు ఉన్నాయి. రుయా, స్విమ్స్, టాటా కేన్సర్, రెండు ప్రైవేట్ ఆస్పత్రులు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న

స్విమ్స్‌లో కేన్సర్‌కు చికిత్స అందిస్తున్నారు. అది కూడా ఆరోగ్యశ్రీ, శ్రీ బాలాజీ వరప్రసాదిని డబ్బులతో. రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒకదానికి మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. మరో దాంట్లో పూర్తిగా నగదు చెల్లింపుతోనే వైద్యం.

వీటన్నింటిలోనూ మొదటగా రోగులకు ప్రాథమిక చికిత్స కోసం కనీసం అంటే 15వేల రూపాయలైనా వెచ్చించాలి. వ్యాధి నిర్ధారణ తర్వాత ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. టాటా కేన్సర్ ఆస్పత్రిలో కొంతమందికి చికిత్స అందిస్తున్నారు. కొన్ని వైద్య పరీక్షలూ ఉచితంగా చేస్తున్నారు. అంకాలజీలో రేడియోథెరపీ చాలా అవసరం. తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి, టాటాకేన్సర్‌లోనూ, స్విమ్స్‌లో మాత్రమే అందుకు తగ్గ యంత్రాలు, అదీ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఇక్కడ కేన్సర్ రోగులకు ఒకసారి రేడియోథెరపీ చేయాలంటే కనీసం 80 రోజులు వేచి ఉండక తప్పని పరిస్థితి. ఒక యంత్రం ద్వారా రోజుకు 60 నుంచి 70 మందికి మాత్రమే రేడియోథెరపీ చేయవచ్చు. ఈ లెక్కన స్విమ్స్, ప్రైవేట్ ఆస్పత్రి, టాటాకేన్సర్‌లో రోజుకు 160 నుంచి 200 మందికి రోజూకా కలిపి పనిచేసే చేయవచ్చు. తిరుపతిలో మరో కేన్సర్ విభాగం అవసరం. రుయాలో అందుకు అన్ని అవకాశాలు ఉన్నా రేడియోథెరపీ ఇచ్చేందుకు అవసరమైన యంత్రాన్ని ఏర్పాటు చేయలేదు. కేవలం 20 కోట్లు వెచ్చిస్తే రుయాలో పూర్తిస్థాయి కేన్సర్ చికిత్స రోగులకు ఉచితంగా అందించవచ్చు. ఆ దిశగా జిల్లా అధికార యంత్రాంగం కానీ, ఆస్పత్రి అధికారులు కానీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం. మరోపక్క ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తామని ప్రకటిస్తున్న ప్రభుత్వం విశాఖపట్నం, గుంటూరు ఆస్పత్రులపై ఉన్న శ్రద్ధ రాయలసీమ ఆస్పత్రులపై చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాస్తో కూస్తో కర్నూలుకు కొన్ని యంత్రాలను కేటాయిస్తున్న, ముఖ్యమంత్రి సొంత జిల్లాలో కేన్సర్‌కు చికిత్స అందించే యంత్రాలనూ ఇవ్వకపోవడం బాధాకరం.

రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ'

రెండో విడత రూ.104.15 కోట్లు జమ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పండుగ వాతావరణంలో జిల్లాలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ 2వ విడత కార్యక్రమంలో 1,54,908 రైతు కుటుంబాలకు రూ.7,000 చొప్పున రూ.104.15 కోట్ల నగదు రైతుల ఖాతాలకు జమ చేశామని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం నాయుడుపేటలోని శ్రీనివాసా కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ 2వ విడత నగదు జమ చేసే కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్' కార్యక్రమం ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయం ను రైతుల ఖాతాలకు మూడు విడతల్లో జమ చేసే కార్యక్రమం చేపట్టిందని, ఇందులో భాగంగా మొదటి విడతగా ఖరీఫ్ సీజన్ లో రూ.7,000 లను ఆగష్టు 2025న జమ చేసిందని తెలిపారు. జిల్లాలో 2వ విడతగా 1,54,908 రైతు కుటుంబాలకు రూ.7,000 చొప్పున రూ.104.15 కోట్ల నగదు రైతుల ఖాతాలకు జమ చేస్తున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గం నుండి లాంఛనంగా ప్రారంభించారన్నారు. మూడవ విడతగా మిగిలిన రూ.6 వేలను సంక్రాంతి తరువాత జమ చేస్తామన్నారు. నగదు జమ కాని వారు ఆందోళన చెందనవసరం లేదని, బ్యాంక్ ఖాతాలు, భూ యజమాని పేరు మార్పు సమస్యల కారణంగా నగదు జమ కాకపోయి ఉండవచ్చునని, లబ్ధిదారులు వీటిని సరిచూసుకోవాలన్నారు.

విధి నిర్వహణలోనే వినూత్నంగా..

జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ లక్ష్యానికి గానూ 12.5 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ షాపులలో మిగిలిన 7.5 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా అందుబాటులో ఉంచామన్నారు. నాట్లు వేసే సమయంలో, మొక్కలు నాటిన 30 రోజులకు, కోతకు సిద్ధం గా ఉన్న కొన్ని రోజుల ముందు ఇలా యూరియా సరఫరా చేస్తామన్నారు. మందుల పిచ్చికారీ చేయడానికి రోజు కూలీ సుమారు రూ.600 నుండి రూ.800 ఖర్చు అవుతుందని, ఒక రోజు గరిష్టంగా 6 ఎకరాలకు మందులు పిచ్చికారీ చేసుకోగలరన్నారు. డ్రోన్ ల వినియోగం ద్వారా ఎకరాకు రూ.350 చెల్లిస్తే సరిపోతుందని, రోజుకు సుమారు 30 ఎకరాలకు మందులు పిచికారీ చేయవచ్చునని, రైతు నేరుగా మందులు చల్లడం ఉండదు కావున వారిని ఆరోగ్యం కాపాడుకోగలుగుతారన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతి జిల్లాలో డ్రోన్ లను రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. చెరువులు తెగకుండా చెరువుకట్టలకు అవసరమైన మరమత్తులు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేకించి నాయుడుపేట నియోజకవర్గంలో చెరువులు తెగే పరిస్థితి లేదన్నారు. 750 మంది రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించామని, ఇంకా అవసరమైతే పనిముట్లు, యంత్ర పరికరాలు అందిస్తామన్నారు.

వరి నాట్లేసిన కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నాయుడుపేట

అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల లక్ష్యమని నెలవల విజయశ్రీ అన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తో కలసి పాల్గొన్న ఆమె రైతులకు ప్రభుత్వం అందించిన రైతు సేవ కార్యక్రమం గురించి మాట్లాడారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని 26,526 మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. రెండవ విడత అన్నదాత సుఖీభవ - పి ఎం కిసాన్ కార్యక్రమం సందర్భంగా సుళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల.విజయ శ్రీ తో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పొలాలలో వరి నాట్లు వేశారు. పెళ్లకూరు మండలం చావలి గ్రామం దగ్గర ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో రైతులు, ఎమ్మెల్యే నెలవల.విజయశ్రీ తో కలిసి కలెక్టర్ ఆర్ ఎన్ ఆర్ 15048 రకం వరి నాట్లను నాటారు ఈ కార్యక్రమంలో నాయుడుపేట మాజీ ఎంపీ నెలవల.సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు కట్ట.వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల.ప్రవీణ్, నాయుడుపేట తహసిల్దార్ రాజేంద్ర, అగ్రికల్చర్ జెడి.ప్రసాదరావు, పెళ్ళకూరు టిడిపి అధ్యక్షులు సంచి.కష్ణయ్య, ఓజిలి టిడిపి అధ్యక్షులు విజయలు నాయుడు పాల్గొన్నారు.

చెవిరెడ్డికి 'కూటమి' బిగ్‌షాక్

అక్రమాస్తుల జప్తుకు ఆదేశాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. మద్యం కుంభకోణం కేసులో అక్రమాస్తుల జప్తుకు ఆదేశాలు జారీ చేసింది. అధికారిక రిజిస్ట్రేషన్ విలువను కేవలం రూ.8.85 కోట్లుగా చూపించినప్పటికీ, నిజానికి వాటి విలువ రూ.54.87 కోట్లుగా సిట్ గుర్తించింది. సిట్ దర్యాప్తు సూచనల మేరకు ప్రభుత్వం క్రింది పేర్లపై ఆస్తుల అటాచ్‌కు ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి, చెవిరెడ్డి సతీమణి లక్ష్మి సిఎంఆర్ ఇన్‌ఫ్రా పేరుతో ఉన్న ఆస్తుల జప్తుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. చెవిరెడ్డి కుటుంబం మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన డబ్బుతో స్థిర, చర ఆస్తులు విపరీతంగా కొనుగోలు చేసినట్లు సిట్ పేర్కొంది. రిజిస్ట్రేషన్ విలువను తక్కువగా చూపించి, పెద్ద మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా బ్లాక్ మనీగా మార్చినట్లు రికార్డులు వెల్లడించాయి.

తిరుపతి జిల్లా చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, తొట్టంబేడు, అలాగే నెల్లూరు జిల్లా గూడూరు, పొదలకూరు, చిత్తూరు జిల్లా పుత్తూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులు ఉన్నట్లు సిట్ పేర్కొంది. వెండోడులోని అరబిందో ఫార్మాకు కె.వి.ఎస్ ఇన్‌ఫ్రా ద్వారా జరిగిన 263.28 ఎకరాల భూమి కొనుగోలు-అమ్మకాల్లో భారీ మోసం జరిగిందని సిట్ తేల్చింది. ఆ సమయంలో భూమి విలువలు అప్రత్యక్షంగా పెంచి.. పెద్ద మొత్తంలో బ్లాక్ మనీని వైట్‌గా మార్చినట్లు నిర్ధారించింది. ఈ ఒక్క లావాదేవీ ద్వారానే కె.వి.ఎస్ ఇన్‌ఫ్రా రూ.13.3 కోట్లు బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చిందని సిట్ నివేదిక తెలిపింది. దర్యాప్తు నివేదిక ఆధారంగా అవినీతి నిరోధక చట్టం, క్రిమినల్ చట్టాల్లోని పలు సెక్షన్ల ప్రకారం ఆస్తుల అటాచ్‌కు అనుమతి ఇవ్వాలని సిట్ ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ, ఆస్తుల అటాచ్ కోసం విజయవాడ కోర్టులో దరఖాస్తు చేసేందుకు అనుమతి ఇచ్చింది. డీజీపీ తదుపరి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులను హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ జారీ చేశారు.

మోదీ, పవన్ కల్యాణ్‌లతో ఎమ్మెల్యే భేటీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

పుట్టపర్తి సాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు బుధవారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు.అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సాయిబాబా మహా సమాధిని సందర్శించి బాబా జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. బాబా జన్మదిన వేడుకల కార్యక్రమం ముగిసిన తర్వాత సత్యసాయి మందిరంలో సేదతీరుతున్న జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భేటీ అయ్యారు. తిరుపతి నియోజవర్గ సమస్యలపై ఇరువురు చర్చించారు. స్థానిక జనసేన నేతలతోపాటు తన సతీమణి సత్యవతిని పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిచయం చేసారు.

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ శ్రీ మురళి వెంకటసుబ్బు భక్తుడు బుధవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం అందించారు.ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు డీడీని అందజేశారు.

అంతర్రాష్ట్ర సైబర్ మోసగాళ్ల ముఠా అరెస్ట్

8మంది ముద్దాయిల అరెస్టు
8 మొబైల్ ఫోన్లు స్వాధీనం
జాయింట్ అకౌంట్‌లో నగదు ఫ్రీజ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లాలో డిజిటల్ అరెస్టు ముసుగులో కోట్ల రూపాయలు దోచుకుంటున్న సైబర్ మోసగాళ్ల గుట్టు రట్టు చేసి, మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దాయిల వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఇద్దరు ముద్దాయిల జాయింట్ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న బాధితుడి రూ.2.5 లక్షల నగదును ఫ్రీజ్ చేసినట్లు వెల్లడించారు. అరెస్టైన ముద్దాయిలలో అనంతపూరు జిల్లాకు చెందిన దన్దే క్రాంతి కుమార్, నిమ్మల పవన్ కుమార్, హైదరాబాద్‌కు చెందిన మానే కోటి బాబు, రాజమండ్రి ప్రాంతానికి చెందిన పరపాల శ్రీనివాస్, బళ్లారి జిల్లాకు చెందిన మరకట్టు చంద్రశేఖర్ రెడ్డి, కొడేలా శివశంకర్, నగారిధన్ ప్రశాంత్ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గుండవేని గౌతమ్ ఉన్నారని తెలిపారు. ఈ కేసులో తిరుపతి నగరానికి చెందిన 65 ఏళ్ల సీనియర్ సిటిజన్‌ను లక్ష్యంగా చేసుకుని, తెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్ చేసి "ముంబై సిబిఐ అధికారులు"గా తమను పరిచయం చేసుకుని, రూ.583 కోట్ల మనీ లాండరింగ్ కేసులో అతని పేరు ఉందని చెప్పి భయపెట్టారు. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా

విచారణ చేస్తామని నమ్మబలికి, అతని బ్యాంక్ అకౌంట్ నుంచి వివిధ ఖాతాలకు డబ్బు పంపాలని ఒత్తిడి చేసి మోసం చేశారు. ఈ విధంగా బాధితుడి నుంచి మొత్తం రూ.80 లక్షలను వివిధ రాష్ట్రాల్లోని మ్యూల్ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. బాధితుడు మోసగాళ్లు స్పందించకపోవడంతో, సైబర్ నేరం జరిగినట్లు గ్రహించి తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ప్రధాన నిందితుడు కోటి బాబుకు టెలిగ్రామ్ ద్వారా హర్యానాలోని డానియల్, చైనాకు చెందిన టెన్, ఇంకా "డి " పేర్లతో ఉన్న విదేశీ నెట్వర్క్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. కోటిబాబు జనవరి 2024లో కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు అక్కడ సైబర్ మోసగాళ్ల నెట్వర్క్‌తో కలిసి పనిచేసి తిరిగి వచ్చి, శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, శివశంకర్, ప్రశాంత్ రెడ్డి, గౌతమ్ లాంటి వ్యక్తుల ద్వారా భారీ సంఖ్యలో మ్యూల్ ఖాతాలను సేకరించేవాడని నిర్ధారించి. ఆ అకౌంట్ల వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సాక్ష్యాలు అన్నీ టెలిగ్రామ్ ద్వారా విదేశాలకు పంపిస్తూ, ప్రతి లావాదేవీపై కమిషన్ పొందేవారని విచారణలో తేలిందని అన్నారు. క్రాంతి కుమార్, పవన్ కుమార్‌లు డీకేకే ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ పేరుతో తప్పుడు పత్రాలతో జాయింట్ కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసి, ఆ ఖాతాలోకి ఈ కేసుకు సంబంధించిన రూ.30 లక్షలు జమై, ఆ తరువాత మొత్తం విదేశీ సైబర్ నెట్వర్క్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు నిర్ధారణ అయ్యింది. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి గమనించిన సందర్భంలో వెంటనే సైబర్ టోల్ ఫ్రీ 1930, ఎమర్జెన్సీ నెంబర్ 112, తిరుపతి పోలీస్ వాట్సాప్ 80999 99977 ద్వారా సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఎస్పిడిఓ తిరుపతి భక్తవచలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ సీఐ వినోద్ కుమార్, ఈస్ట్ ఎస్ఐ హేమాద్రిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పి రవి మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

అన్నానికి డబ్బు ఇవ్వలేదని..

గొంతుకోసి హత్యచేసిన అగంతకుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టపగలే పుత్తూరులో దారుణహత్య చోటు చేసుకుంది. ఆకలిగా ఉందని, అన్నం తినేందుకు డబ్బులివ్వాలని ఓ ఆగంతకుడు రవి రోడ్డుపై ఉన్న రామ్మూర్తిరెడ్డి(48)ని అడిగాడు. అయితే అడిగిన వెంటనే డబ్బు ఇవ్వలేదని ఆ వ్యక్తిని కత్తితో గొంతు కోసి హత్యచేసిన హృదయవిదారకమైన ఘటన అందరినీ షాక్‌కు గురిచేసింది. వివరాలిలా ఉన్నాయి. రోజువారీ పనులతో నిత్యం రాకపోకలు జరిగే గొల్లపల్లి పెట్రోల్ బంకు వద్ద ఓ వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. పుత్తూరు మండలం మిట్టపల్లూరు గ్రామానికి చెందిన రామ్మూర్తిరెడ్డి (48) బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ద్విచక్రవాహనంపై పుత్తూరు వెళుతుండగా ఓ అగంతకుడు అన్నం తినేందుకు రామ్మూర్తిరెడ్డిని డబ్బు అడిగాడు. డబ్బు లేదని చెప్పడంతో వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అకస్మాత్తుగా రవి చేతిలో ఉన్న కత్తితో దాడిచేసి ఆయన గొంతు కోసేశాడు. దాడి అనంతరం అక్కడనుంచి పరారవడానికి ప్రయత్నించగా రవిని స్థానికులు వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న రామ్మూర్తిరెడ్డిని పుత్తూరు

ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పుత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హంతకుడు రోజువారీ కూలి పనులు చేస్తూ కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే రవి (35) అని పోలీసులు తేల్చారు. రామ్మూర్తిరెడ్డి విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడని సమాచారం.

'మీ డబ్బు... మీ హక్కు' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మీ డబ్బు- మీ హక్కు అనే నినాదం తో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు.

బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మౌర్య తో కలిసి మీ డబ్బు- మీ హక్కు గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించబడుతుందన్నారు. ప్రజలు బ్యాంకులో డిపాజిట్స్ చేయడం , షేర్స్ , బీమా పాలసీలు, ఇతర ఆర్థిక సాధనాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారని, అయితే కొన్ని సందర్భాలలో ఈ ఆస్తులు పరిపక్వతకు వచ్చిన తరువాత లబ్ధి దారులకు చేరకపోవడానికి ఖాతాదారుల మరణం , చిరునామా మార్పు లేదా నామినీ వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయి అని చెప్పారు. ఈ ప్రచారం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని నిధులను గుర్తించి సరి అయిన పత్రాలతో సులభం గా క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించబడుతుందని తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి రవి కుమార్, ఏఎల్డీఎం మధుసూదన్ రెడ్డి, కలెక్టరేట్ యూనియన్ బ్యాంకు మేనేజర్ చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రవీణ్‌కు సకల కళా వల్లభ అవార్డు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతికి చెందిన ప్రముఖ విద్యావేత్త, సినీ నిర్మాత డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ప్రతిష్టాత్మకమైన సకలకళ వల్లభ-2025ను బుధవారం స్వీకరించారు. అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 25 వ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా(సిల్వర్ జూబ్లీ) ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయమూర్తి దేవ్ నరసింహారావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ సిహెచ్వీఎస్ఎన్. కుమార్, ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ముఖ్య అతిథులు న్యాయమూర్తి దేవ్ నరసింహారావు మాట్లాడుతూ ఒకే రంగంలో నిష్ణాతులైన వారు, పలు సేవలు అందించినవారు, దీర్ఘకాలం అందించిన వారిని ఎంతో మందిని చూశానని, కానీ ఒకే వ్యక్తి అనేక రంగాలలో తనదైన శైలిని ప్రదర్శించి, మన్ననలు అందుకోవడం చాలా అరుదు అన్నారు. అటువంటి వ్యక్తి డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అని ప్రశంసించారు.మల్లికార్జున్, జాయ్ కుమార్, ఎన్.రాజ్, మామిడి సత్యం పాల్గొన్నారు.

లోకేష్‌కు మెరుగైన వైద్యం టిటిడి అందించాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి తిరుమలలో లగేజీ కౌంటర్లో డ్యూటీ నిమిత్తం మంగళవారం తిరుపతి నుండి తిరుమలకు స్కూటర్లో వెళ్తున్న క్రమంలో తిరుమల ఘాట్ రోడ్డులో రాయి జారిపడి తల మీద పడడంతో తీవ్రమైన గాయమైంది. వెంటనే అశ్విని హాస్పిటల్ కి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరి ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, లోకేష్ కు మెరుగైన వైద్యం టిటిడి అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లోకేష్ కోలుకొని డ్యూటీ కి వచ్చేంతవరకు జీతం చెల్లించాలని, వైద్య ఖర్చులను టిటిడి భరించాలని కోరారు.

ముత్యపుపందిరిపై శ్రీవారి దేవేరి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం ముత్యపుపందిరి వాహనంపై ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు విహరించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు సింహ వాహనంపై శ్రీ పద్మావతి అమ్మవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవల్లో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.గజ వాహనం రోజున అమ్మవారి వాహన సేవకు అలంకరించేందుకు తమిళనాడుకు చెందిన హిందు ధర్మార్థ సమితి ట్రస్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.ఆర్.గోపాల్‌జీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తిరుచానూరు అమ్మవారి ఆలయ మహాద్వారం వద్ద ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు ఐదు గొడుగులను కానుకగా అందజేశారు.



రాష్ట్ర కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బుధవారం నిర్వహించిన కబడ్డీ అండర్ -14 బాలురు, బాలికల్లో రాష్ట్ర కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఏడు డివిజన్ల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర జట్టుకి ఎంపిక చేశారు. వీరు ఈ నెల 22,23,24 తేదీలలో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రమణయ్య , టిడిపి మండల ప్రెసిడెంట్ ఎం సుధాకర్ నాయుడు, ఏఎంసి చైర్మన్ జ్యోతి సుధాకర్ నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, బియన్ కండ్రిగ ఎస్ఎంసి ప్రెసిడెంట్ మస్తాన్ హరిబాబు, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు పి కిషోర్ కుమార్, భార్గవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- పాకాల: స్థానిక యస్ఎవి పాఠశాలలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంతో బాగా అధ్యక్షతన నిర్వహించారు. సమాజంలో పురుషులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. సాధారణ జీవితాలు గడిపేవారి గురించి చెప్పటం సంఘానికి, వర్గానికి, కుటుంబానికి, వైవాహిక వ్యవస్థకు, శిశు సంరక్షణకు, పర్యావరణకు పురుషులు చేసిన ప్రయోజనాలను గుర్తించటం దీని ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఉపాధ్యాయినులు సత్కరించారు.

'కైలాస ధామం'కు రూ. లక్ష విరాళం

విరాళంగా చెక్కును అందిస్తున్న దాత

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలో నిర్మిస్తున్న కైలాస ధామంకు దాతలు ముందుకు వస్తున్నారు. తిరుపతి క్రాకర్స్ అసోసియేషన్ తరపున లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. విరాళం చెక్కును ఎమ్మెల్యే పులివర్తి నానికి అందించడంతో వారికి కమిటీ సభ్యులతో పాటు ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందధామం అధ్యక్షులు వీరాంగారి రమేష్ రెడ్డి, క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మసీదులు, దర్గాల వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉమీద్ పోర్టల్‌లో మసీదులు, దర్గాలకు సంబంధించిన అన్నీ వివరాలను నమోదు చేయాలని ముతవల్లీ కమిటీ నియోజక వర్గ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ సూచించారు. గూడూరులోని షాదీమంజిల్‌లో ముతవల్లీ కమిటీ నియోజకవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజక వర్గంలోని మసీదులు, దర్గాలు ప్రతినిధులు, ముస్లింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడు రహీమ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉమీద్ పోర్టల్‌ను తీసుకొచ్చిందని, ఆ పోర్టల్ మసీదులు, దర్గాలు, ఈద్గాల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్నీ వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఎవరికైనా అనుమానాలుంటే తమను సంప్రదించాలని సూచించారు. వచ్చే నెల ఐదో తేదీ లోపు వివరాలు నమోదు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇమామ్‌లు, తదితరులకు వేతనాలు విడుదల చేశారని ఇందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో కమిటీ ప్రతినిధులు మస్తాన్ బాషా, అల్లీహుస్సేన్, జిలానీ బాషా, అమీర్ బాషా, సుభహాన్, మౌలానా షఫీ, అమీరుద్దీన్, పాల్గొన్నారు.

గోపి నాయుడు మృతి తీరని లోటు: వైసిపి

గోపీనాయుడుకి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ, కమ్మవారి పాలెంకు చెందిన గోపి నాయుడు మృతి వైసిపికి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. అతడి మృతి వార్త తెలిసిన వెంటనే సత్యవేడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నూక తోటి రాజేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపి నాయుడు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని నూక తోటి రాజేష్ పేర్కొన్నారు. అనంతరం చరవాణి ద్వారా గోపి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల కన్వీనర్ మణి నాయుడు మాట్లాడుతూ గోపి నాయుడు సేవలను స్మరించుకుంటూ ఆయన సేవలు ఎనలేనివన్నారు. ఆయనను కోల్పోవడం మన దురదృష్టమని వైసిపికి తీరని లోటు అన్నారు. గోపి నాయుడు భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వారి ఇంటికి చేరుకొని నివాళులు అర్పించారు.

ధీర వనిత ఇందిరా గాంధీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ధీర వనిత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని పీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు కొనియాడారు. స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోం లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ధైర్య సాహసాలు కలిగిన మహిళగా ఇందిరమ్మ దేశాభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ముఖ్యంగా పేదల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటముని, గోపి, శివ, నాగూరయ్య పాల్గొన్నారు.

క్యాంపస్ : ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎస్వి యూనివర్సిటీ ప్రకాశం భవనంలో భారతరత్న, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం ఫౌండర్, భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 108 వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివ బాలాజీ మన్సూర్, కుమార్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు ప్రవీణ్ , నంద, గణేష్, లింగ, సుబ్బారాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: తిరుపతి సంజయ్ గాంధీ కాలనీ కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతిని తిరుపతి నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బి.రవి, నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఘన నివాళులు

ప్రజాశక్తి -చంద్రగిరి: డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు ఇటీవల మరణించి మూడు నెలలు గడిచాయి. ఈ సందర్భంగా దుస్తులు పెటే కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అతని భార్య పులివర్తి సుధారెడ్డి ఆయనకు నివాళులర్పించారు. వారు సుబ్రహ్మణ్యం నాయుడి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

రైతుల అభివృద్ధే కూటమి ధ్యేయం: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండవ విడత కార్యక్రమంలో భాగంగా వనజా కృష్ణల్యాణ మండపంలో బుధవారం రైతులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం లో అన్నదాత సుఖీభవ ద్వారా 22 వేల 217 కుటుంబాలకు 14 కోట్ల 80 లక్షల 19 వేల రూపాయలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు , బిల్లు చెంచురామయ్య , మస్తాన్ నాయుడు , శీలపతి నాయుడు, మల్లం ప్రవత్ రెడ్డి , పట్నాల రెడ్డి , చిన్న వైస్‌ఛైర్, ఏడీ గోపీనాయక్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదలలో భాగంగా పుత్తూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెండవ విడతగా నగరి నియోజకవర్గంలో మొత్తం 20,063 మంది రైతులకు రూ.13.29 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, ఉద్యానవన వెంకట సౌజన్య, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దారు వెంకటేశ్వర్లు, పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎన్ ధనపాల్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మాజీ ఎంపీపీ ఎలుమలై అమ్ములు, ఆ పార్టీ అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


పుత్తూరులో

ఏర్పేడు: ఏర్పేడు మండల కేంద్రంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 22 వేల 552 కుటుంబాలకు 18 కోట్ల 64 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే రైతులకు అందించారు. ఈ కార్యక్రమం లో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడు వ్యవసాయ శాఖ ఏడి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అన్నదాత సుఖీభవ సాయం పంపిణీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా ప్రారంభించారు. సత్యవేడు నియోజకవర్గంలో అర్హులైన 29,653 రైతు కుటుంబాలకు 20 కోట్ల 2337 రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రాజశేఖర్, మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమ రావు, వ్యవసాయ అధికారులు మురళి, సంజీవరెడ్డి, శోభారాణి, చిట్టిబాబు, షణ్ముగం, ఏఈఓ ప్రవీణ్, కన్నవరం సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, రమణ, రాజా, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్టపై ఉన్న శ్రీ ముత్యాలమ్మ గుడి వద్ద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమ కార్యక్రమాన్ని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యే పులివర్తి నానీ లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు సి ఆర్ రాజన్, చంద్రగిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, ఆరి లీలామోహన్ నాయుడు, బాదూరు కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చైన్ స్నాచింగ్ దొంగ అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి పట్టణంలో అక్టోబర్ 4వ తేదీన చోటుచేసుకున్న వరుసగా ఐదు చైన్ స్నాచింగ్ , ఒక బైక్ దొంగతనానికి పాల్పడ్డ దొంగను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పి సుబ్బారాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అలిపిరి పోలీసులు ప్రత్యేకంగా నిఘా వేసి వుంచగా ఈనెల 18వ తేది ఆటోనగర్, కాటన్ మిల్ రైల్వే గేట్ సమీపంలో వాహన తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా ఒక పల్సర్ మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తిని ఆపమని చెప్పినా బైక్ వదిలివేసి పరారయ్యేందుకు ప్రయత్నించాడని వెంటనే పోలీసులు వెంబడించి అతడిని పట్టుకున్నారన్నారు. అరెస్టయిన వ్యక్తి ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాకు చెందిన గుర్ముఖ్ (53)గా గుర్తించారని, విచారణలో అతను బావారియా తెగ, ముఠాకు చెందిన సభ్యుడు అని, షామ్లీ, షహరాన్పూర్, కేరనా జిల్లాల్లో ఇళ్ల దొంగతనాల కేసుల్లో జైలుశిక్ష అనుభవించిన నేర చరిత్ర కలిగి ఉన్నట్లు వెల్లడైందన్నారు. మొత్తం 5 చైన్ స్నాచింగ్ కేసులు, ఒక బైక్ దొంగతనం కేసుకు సంబంధించి నేరం అంగీకరించాడన్నారు. తన ఇద్దరు సహచరులు జయరాం, మోహన్ లతో కలిసి అక్టోబర్ 4న తిరుపతికి వచ్చి, ఎల్జి సర్వీస్ సెంటర్ వద్ద పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగిలించి, అదే బైక్‌పై తిరుపతిలో వరుస చైన్ స్నాచింగ్‌లు చేసినట్లు విచారణలో అంగీకరించాడన్నారు. చోరీకి గురైన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఇందుకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పి అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి రవి మనోహర ఆచారి, ఎస్ పీడీఓ తిరుపతి భక్తవత్సలం, అలిపిరి పోలీసు సిబ్బంది, ఎన్స్పెక్టర్ పిఎస్వి రామకిషోర్, ఎస్ఐ నాగార్జున రెడ్డి, కానిస్టేబుల్ స్వయం ప్రకాష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

- 12 ఎర్రచందనం దుంగలు లభ్యం
- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు, కారు స్వాధీనం

ప్రజాశక్తి-నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని బోధనం టోల్ ప్లాజా వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐలు సి. వినోద్ కుమార్, కేఎస్కే. లింగాధర్ టీమ్ లు మంగళవారం నాయుడుపేట చేరుకుని, గూడూరు, రాపూరు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారు జామున కడివేడు ఫారెస్ట్ బీటు పరిధిలోని బోధనం టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనఖీ చేయసాగారు. ఒక వాహనం పోలీసులను చూసి కొద్ది దూరంలోనే ఆపి, అందులోనుంచి ఇద్దరు వ్యక్తులు కారు దిగి పారిపోవడాన్ని టాస్క్ ఫోర్సు సిబ్బంది గమనించారు. వెంటనే వారిని వెంబడించి పట్టుకుని కారులో తనిఖీ చేశారు. కారులో 12ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. వారిని డీఎస్పీ వి.శ్రీనివాస రెడ్డి, ఎసీఎఫ్ జె. శ్రీనివాస్ విచారించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో రైతుకు గాయాలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: వ్యవసాయ పొలంలో దుక్కి దున్నుతూ అదుపుతప్పి ట్రాక్టర్ తిరగబడడంతో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ అయిన రైతు గాయాలు పాలైన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాలాయపల్లి మండల పరిధిలోని అంబలపూడిలో తమ సొంత పొలంలోని రైతు సముద్రాల చంద్రయ్య అనే రైతు కౌలు తీసుకున్న పొలంలో ట్రాక్టర్‌తో నారుమడులు, చదులు చేసుకుంటుండగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో చంద్రయ్య కేకలు పెట్టడంతో కేకలు గమనించిన స్థానికులు వెళ్లి చూసేసరికి.. ట్రాక్టర్ కిందపడి ఉండడం చూసి వెంటనే వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గంటపాటు ట్రాక్టర్ కింది విగత జీవిగా ఉన్నాడు. కాలు ట్రాక్టర్ బ్రేకై ఫెడల్ రేకు మధ్యలో చిక్కిపోవడంతో గ్రామస్తులు సహకారంతో గంట పాటు శ్రమించి 108 సాయంతో గూడూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ప్రమాదం నుండి తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

కేన్సర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం ఆదేశానుసారం, పొదుపు సంఘాల సంచాలకులు వి నాగరాజు సూచన, సలహాల మేరకు గేట్ పుత్తూరులో రాస్ మహిళా సంఘ సభ్యులకు రాస్, టాటా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టాటా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ మేనేజర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ కేన్సర్ చాలా ఉధృతంగా వుండడం వల్ల గ్రామాలు, ఏరియాలలో విరివిగా కేన్సర్ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. మనిషికి నేడు పని ఒత్తిడి భారంతో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆనందంగా అభివృద్ధి చెందుతాయన్నారు. రాస్, టాటా ట్రస్ట్ ద్వారా కల్పించే సదుపాయాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రక్త పోటు , మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు బృందం, హేమంత్ కుమార్ , రెడ్డికుమారి, మెహతాజ్ ,మహేంద్ర, రాస్ సిబ్బంది వేదాచలం, బాలకృష్ణ, మునిరత్నమ్మ ,స్వాతి, శరవనన్, సంఘ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీపీ

మాట్లాడుతున్న ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పూడేరూ సచివాలయంలో జరిగిన నిర్వహించిన స్వామిత్వ గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ కంటాలలో ఇల్లు నిర్మించుకున్న వారికి రెవెన్యూ అధికారులు స్వమిత్వా లో సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వనున్నారని తెలిపారు. ప్రజలు, రెవెన్యూ అధికారులకు అందుబాటులో ఉండి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూడేరు సర్పంచ్ శాంతమ్మ, సెక్రటరీ శేఖర్, మండల సర్వేయర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'పచ్చదనం- పరిశుభ్రత' పై శిక్షణ

ప్రజాశక్తి-వాకాడు: వాకాడు మండలంలో బుధవారం స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో 'థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్'పై శిక్షణ నిర్వహించారు. పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సర్పంచులందరూ తప్పకుండా హాజరు కావాలనే విషయం తెలిపినా 19 మంది సర్పంచులకు ఐదుగురు సర్పంచులు హాజరు కావడం విశేషం. తహశీల్దారు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ గ్రామాల లో పరిశుభ్రత ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని, పరిసరాలను క్లీన్ అండ్ గ్రీన్ గా చేసుకుని గ్రామ అభివృద్ధికి ప్రజలు తోడ్పడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి సురేష్ , ఏపీవో విజయమ్మ, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-వెంకటగిరి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా సాధికారతపై అవగాహనను స్థానిక జెడ్‌పి గర్ల్స్ హైస్కూలులో నిర్వహించారు. సమాజంలో మహిళల స్థానం, వారి సాధన, వారి అభ్యున్నతికి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టామని గ్రంథాలయ సహాయకురాలు టీ లీలావతి తెలిపారు. స్కూల్ ఇన్‌చార్జి ఆర్ మీనాక్షి, హిందీ ఉపాధ్యాయురాలు సుభద్ర , బయాలజీ ఉపాధ్యాయురాలు ఆర్ శారదవాసంతి ప్రసంగించారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ శాఖ గ్రంథాలయం, వెంకటగిరి సిబ్బంది పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -కోట : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కోట గాంధీ బొమ్మ సెంటర్ నుండి క్రాస్ రోడ్ వరకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి ఉపసర్పంచ్ కస్తూరయ్య యాదవ్,మద్దూరు స్వరూప్, గంపా కోటేశ్వరరావు, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ కనుపూరు. జగదీష్, ముంతల మునికుమార్ పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయ్ అందరికీ స్ఫూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఝాన్సీ లక్ష్మీబాయ్ మహిళలకు స్ఫూర్తి అని, చిన్నపుడే పురుషులతో సమానంగా గుర్రపుస్వారి, ఖడ్గవిద్య, కుస్తీ పోటీలు, విలువిద్య మొదలైన నైపుణ్యతను నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసంతో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని వక్తలు అన్నారు. అన్నమయ్య కూడలిలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి జె శివప్రసాద్ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయ్ జయంతిని నిర్వహించారు. డాక్టర్ డి.యువశ్రీ ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఉయ్‌సపోర్టు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు, ఇంపాక్ట్ క్లబ్ రీజినల్ ప్రెసిడెంట్ తహసున్నీసా బేగం పాల్గొన్నారు.

దుకాణం కూల్చివేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక సన్నిధి వీధిలో ఉన్న ఓ దుకాణాన్ని మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. సదరు దుకాణం శ్రీకాళహస్తి దేవస్థానం సంబంధించిన కాలువపై అక్రమంగా నిర్మించారని ఆలయాధికారులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే తొలగించాలంటూ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు దుకాణాన్ని తొలగించే ప్రయత్నం చేయగా దాన్ని ఏర్పాటు చేసుకున్న సిరి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు ఆమెని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. దుకాణం పక్కనే ఉన్న ఇంటిని సైతం కూల్చేందుకు అధికారులు పూనుకోవడంతో ఆ యజమాని హైకోర్టు ఆర్డర్ ఉందని చూపడంతో వెనుదిరిగారు.

బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని మేల్చూరు ఎస్టీ కాలనీకి చెందిన పలువురు విద్యార్థులు పల్లం హైస్కూల్లో చదువుతున్నారు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లం హై స్కూల్ కి విద్యార్థులు రావడానికి సరైన సౌకర్యం లేకపోవడంతో పిల్లల చదువుకి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ప్రధానోపాధ్యాయులు టి ఆనంద్ చొరవతో ఆర్టిసి ఈడీ చంగల్ రెడ్డి స్పందించారు. దీంతో వెంకటగిరి డిపో మేనేజర్ రామకృష్ణ విద్యార్థులకు బస్సు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం డిఇఓ కెవిఎన్ కుమార్ చేతుల మీదుగా జెండా ఊపి బస్సును ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమలత, దయాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హాస్టల్ డే వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో హాస్టల్ డే వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జెవి రమణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ వినూ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టరు వి వైకుంఠరావు హాజరయ్యారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి జగపతి రామయ్య, హాస్టల్ వార్డెన్లు డాక్టర్ బి రాంబాబు నాయక్, డాక్టర్ కె లక్ష్మి కవిత విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల సంక్షేమం కోసం అదనపు వార్డెన్లు డాక్టర్ ఈ తిరుపతి రెడ్డి, డాక్టర్ ఎం. స్రవంతి నిరంతరం సహకరిస్తున్నారని వార్డెన్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి అందించిన సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని వారు పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పొదుపు సంఘాల మహిళలకు ఏపీఎం సూచన

ప్రజాశక్తి -కోట : పొదుపు సంఘాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం అనీలా సూచించారు. కోట మండలంలోని ప్రకాశం కాలనీలో గూడలి 1సంఘ బంధం మహిళలకు ఐకేపి ఏపిఎం అనీలా ఆధ్వర్యంలో బుధవారం సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏపీఎం అనీలా మాట్లాడుతూ మహిళల కోసం నిర్వహించిన పొదుపు సంఘాలకు అందిస్తున్న రుణాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలు బకాయిలు లేకుండా బ్యాంకులో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ మేరకు కొత్త రుణాలు పొందాలని సూచించారు. 3 రోజులు శిక్షణలో భాగంగా రెండవ రోజు పొదుపు సంఘాలు ద్వారా మహిళలు ఎలా అభివృద్ధి చెందాలో పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మహిళల ఆరోగ్యం గురించి మాట్లాడుతూ మహిళలు పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనీలా,సీసీ సుబ్రహ్మణ్యం, అకౌంటెంట్ హిమబిందు, విఓఏ పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సర్పంచ్ జన్మదిన వేడుకలు

నెలవల అమృత సరళ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాతృ మూర్తి, భీమవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ నెలవల అమృత సరళ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసంలో నిర్వహించిన నెలవల అమృత సరళ జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే తోపాటు పలువురు టిడిపి నాయకులు నెలవల అమృత సరళకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలవల అమృత సరళ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. టిడిపి నాయకులు కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, సర్పంచ్ అమృత సరళకు శాలువాలు కప్పి సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు గృహ నిర్మాణ మంజూరు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 పథకం కింద పట్టణ ప్రాంతాలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో లబ్ధిదారుడు స్వయంగా స్వంత ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పుత్తూరు పురపాలక సంఘ కార్యాలమంలో గురువారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా అందించనున్నారని పురపాలక సంఘ కమిషనర్ డివి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు ప్రధాన మంత్రి స్వానిధి కింద వీధి విక్రయాదారుల మంజూరైన రుణాలను మొత్తం మెగా చెక్కు ద్వారా శాసన సభ్యులు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించనున్నారు.

వేడుకగా స్వర్ణముఖి నదీ హారతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉత్తర వాహినిగా పేరు గడించిన స్వర్ణముఖి నదికి బుధవారం సాయంత్రం హారతులు సమర్పించారు. తిరుపతి జిల్లాల్లో ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర ఆలయ పరిధిలోని స్వర్ణముఖి దక్షిణ భారతంలో ప్రవహించే ప్రముఖ నదుల్లో ఒకటి. ఈ నదికి ప్రతి ఏటా కార్తీక మాసంలో హారతి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే స్వామీ అమ్మవార్లను నంది, సింహ వాహనాలపై ఊరేగింపుగా నది వద్దకు తీసుకువచ్చారు. అనంతరం దేవతామూర్తులకు వేద పండితులు శాస్త్రోక్తంగా స్వర్ణముఖికి హారతులు సమర్పించారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన అరికడదాం

ఇన్‌చార్జి జెసి, కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలో బహిరంగ మల, మూత్ర విసర్జన జరగకుండా పలుచోట్ల మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని ఇందుకు ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య పిలుపు నిచ్చారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజనీర్ తులసి కుమార్, రెవెన్యూ ఆఫీసర్ రవి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

తిరుపతి తేది 10.09.2025న కప్పల వీరస్వామి కమల్ అను నేను నాకు చెందిన రిజిస్ట్రార్ పార్టీషియన్ డీడ్ డాక్యుమెంట్ నెం.411/2003 డ్యూప్లికేట్ పత్రాలు పోయినవి. నేను తిరుపతి నుండి సత్యవేడుకు పోవుటకు తిరుపతి బస్టాండ్‌లో బస్ ఎక్కు సమయంలో నా డాక్యుమెంట్ పోయినవి. ఈ డాక్యుమెంట్ ఎవరికైన దొరికితే ఈ సెల్ నెంబరుకు 6305827969 ఫోన్ చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE, (JUNOR DIVISION) CUM, JFCM : PUTTUR
O.S.120/2020

BETWEEN:
K. KESAVA REDDY & others ...PLAINTIFFS
AND
M. VENKATESWARA VARMA (Died) & others ...DEFENDANTS

SUMMONS TO THE DEFENDANTS NO.3 to 6.
DEFENDANTS NO. 3 to 6. Hg.23-12-2015.
D.3) Parvathi W/o late M. Venkateswara Varma.
D.4)M. BALAJI VARMA 5/o late M. Uma Maheswara Varma.
D.5)M. THARANGINI VARMA Dio late M. Uma Maheswara Varma.
D.6) Susmitha Varma Dio late M. Uma Maheswara Varma.
No.3to6 are residing at 19-3-2/1187, Srinivasa puram, Near Harinatha Reddy Junior College, Old Renigunta Road, Tirupathi, and Chittoor District.
Sir, Please take summons that the above case in O.S.No.120/2020 is posted for your appearance on.23-12-2025. If you have got any objection you may appear before this court at 10-30A.M. On either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.
V.M. NARENDRA KUMAR, B.A., B.L.,
ADVOCATE FOR PLAINTIFFS, PUTTUR.

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE, (JUNOR DIVISION) CUM, JFCM : PUTTUR
I.A.No.850/2020, O.S.No.120/2020

BETWEEN
K. KESAVA REDDY & other ....Petitioners/Plaintiffs.
AND:
M. VENKATESWARA VARMA (Died) & others. ...Respondents/Defendants.

NOTICE TO THE RESPONDENTS NO.3 to 6.
RESPONDENTS NO. 3 to 6. Hg.23-12-2025.
R.3) Parvathi W/o late M. Venkateswara Varma.
R.4)M. BALAJI VARMA S/o late M. Uma Maheswara Varma.
R.5)M. THARANGINI VARMA D/o late M. Uma Maheswara Varma.
R.6) Susmitha Varma Dio late M. Uma Maheswara Varma.
No.3 to 6 are residing at 19-3-2/1187, Srinivasa puram, Near Harinatha Reddy Junior College, Old Renigunta Road, Tirupathi, and Chittoor District.
Sir,
Please take notice that the above case in I.A.No.850/2020 in O.S.No.120/2020 is posted for your appearance on.23-12-2025. If you have got any objection you may appear before this court at 10-30A.M. On either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.
V.M. NARENDRA KUMAR, B.A., B.L.,
ADVOCATE FOR PETITIONER, PUTTUR.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) OF TIRUPATI
O.E.P. No: 23 of 2023
O.S. No:243 of 2014

Bet:
P. Prabhakar Reddy ...Decree Holder
And
P. Lakshmamma & others ...Judgement Debtors

SALE NOTICE TO JUDGMENT DEBTORS 3 AND 4

To
1. J.D.No. 3: P. Sivakumar Reddy, S/o. Late P. Raghava Reddy, D.No. 19-6-18/C, STV Nagar, Tirupati town, Tirupati Urban Mandal, Tirupati District.
2. J.D.No. 4: K. Geetha, W/o. K. Kumaraswamy Reddy, D/o. Late P. Raghava Reddy, D.No. 19-45-S9-768, STV Nagar, Tirupati town, Tirupati Urban Mandal, Tirupati District.
Sir/Madam,
Please take notice that in the above Execution Petition the Hon'ble Court ordered Sale Notice to both of you and the above Execution Petition stands posted to 25-11-2025 for your appearance. Hence both of you are hereby directed to appear before the above said Court on 25-11-2025 at 10-30 A.M, either in person or through your pleader and file your objections, in default of your appearance on 25-11-2025 before the above said court, the above Execution Petition will be heard and determined in your absence.
Hearing date: On 25-11-2025 at 10-30 AM.,
T. BHANUSUNDAR, M.B.A., LLB.,
Advocate for the Decree Holder,
MOBILE NO. 83176 49480.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, గూడూరు
O.S.No. 183/2024

Union Bank of India, Main Branch, Gudur Rep by its Branch Manager ...Plaintiff
VS
Oduru Anandamma and two others ...Defendants

To
D3. Ishanaka Jyothi, Hindu, aged about 42 years, W/o. Kanunakar Reddy, D/o. Late Kasturi Reddy, Residing at Chinnakatuvapalli Village Thikkavaram Post, Chillakur Mandal, Tirupathi Dt

వాది అయిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గూడూరు బ్రాంచ్ వారు 5. 12,72,854/-2 O.S.NO: 183/2024 ఉన్నందున యిందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల 06.12.2025 ఉదయం 10 గం॥లకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని, ఈ కోర్ట్‌లో హాజరై వారితో మనవి చేసుకోవలసినది లేని యెడల, సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.
వాయిదా: 06.12.2025
డి.వెంకటేశ్వరరావు,
వాది తరపు న్యాయవాది, గూడూరు
9866072082.

శ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No.262/2024
O.S.No.46/2019

మెంట అరుణమ్మ ... Petitioner / Plaintiff
V/s
1. ఎల్లోజి వెంకట సుబ్బయ్య (Died)
2. ఎల్లోజి నవీన్ కుమార్
3. ఎల్లోజి హరిక్రిష్ణ ... Respondents / Defendants

నోటీసు

To
R2: Yelloji Naveen Kumar, S/o. Late Venkata Subbaiah, NGO Colony, Backside of NJR Building, Opposite to Watertank, Venkatagiri Town & Municipality SPSR Nellore Dist
R3: Yelloji Hari Krishna, S/o. Late Venkata Subbaiah, NGO Colony, Backside of NJR Building, Opposite to Watertank, Venkatagiri Town & Municipality SPSR Nellore Dist

పై నెంబరు కేసులో పిటిషనరు ఫైనల్ డిక్రీ కొరకు పైవారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీ నోటీసు నిమిత్తం 5.12.2025దిన వాయిదా వున్నది. ఆరోజు ఉదయం గం॥10:30ని॥లకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై వాకి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఇట్లు
పి.గోపాల్ రెడ్డి, B.Com., BL
పి.నరేంద్ర, B.Sc., L.L.B
వాది తరపు న్యాయవాదులు
గూడూరు

చినుకు పడితే చిత్తడే!

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలో ఒకే ప్రాంగణంలో రెవెన్యూ, ఉప ఖజానా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఇక్కడ సెలవు రోజులు మినహా నిత్యం ప్రజలతో ఆయా కార్యాలయాలు కిటకిటలాడుతాయి. వర్షాలు వచ్చిన సమయంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు బురదతో రొచ్చుగా మారుతున్నాయి. ఇక్కడ చినుకు పడితే చిత్తడిగా మారడంతో ఫిర్యాదుదారులు అవస్థలుపడుతున్నారు. ఇక్కడ తహశీల్దారు కార్యాలయమా? లేదా పార్కింగ్‌కు నిలయమా?' అన్నట్లు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వర్షంలో ఉండటానికి వీలు లేకుండా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఫిర్యాదు దారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

జ్ఞానం వేగవంతంగా సామాన్యులకు చేరాలి

గ్రంథాలయ ముగింపు సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి - క్యాంపస్ : జ్ఞానం వేగవంతంగా సామాన్యులకు చేరాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఎస్వీయూ, యూజీసీ – ఇన్ఫ్లిబిట్ సంయుక్తంగా ఎస్వీయూ లైబ్రేరియన్ ఆచార్య సురేంద్రబాబు, ఇన్ఫ్లిబిట్ అధినేత ఆచార్య దేవిక మద్దాలి ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల 'లైబ్రరీ 2047: అభివృద్ధి భారతం వైపు జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడం' అనే అంతర్జాతీయ సదస్సు ముగింపు సభ ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ముగిసింది. ఇందులో ముఖ్య అతిథులుగా ఎన్బీఏ అడ్వైజర్ ఆచార్య జగదీష్ అరోరా, మహిళ వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి ఉమా, ఎస్వీయూ రెక్టార్ ఆచార్య చిప్పాడా అప్పారావు, ఇంఫ్లిబిట్ జాయింట్ కన్వీనర్ రాజా, పాండిచ్చేరి అధ్యాపకుడు ఆచార్య సేవుకన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సమాచారం, పరిశోధనలు, సాహిత్యాలు, రచనలు, వార్తా విశేషాలు తదితరాంశాలు సామాన్య ప్రజలకు వేగంగా చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి తీర్మానాలు పేరుతో తొమ్మిది తీర్మానాలు వారు ప్రకటించడం ప్రకటించారు. అందులో ప్రధానంగా అభివృద్ధి భారతం 2047 కూ జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడానికి, దార్శనికతను సాధించడానికి జాతీయ స్థాయి గ్రంథాలయ విధానాన్ని రూపొందించాలన్నారు. మారుతున్న వాతావరణంలో నిబద్ధత, పునఃసమర్థనతో కొత్త వ్యూహాలు, సాధనాలు, పద్ధతులను అనుకరించడం ద్వారా వేగవంతమైన సేవలను అందించడానికి అవసరమైన మృదువైన, కఠినమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి గ్రంథాలయాలనూ, లైబ్రరీ సైన్స్ ఉపాధ్యాయులకు కఠినమైన ఇన్‌సర్వీస్ శిక్షణ, క్రమబద్ధమైన లైబ్రరీ ఇంటర్న్‌షిప్‌లు, బహుళ విభాగ విధానంతో నైపుణ్యం ఆధారిత అభ్యాసంపై ప్రాధాన్యతనిచ్చే ఎన్ఈపి – 2020 వంటి తాజా పరిణామాలకు అనుగుణంగా లైబ్రరీ ప్రాక్టీషనర్లు , లైబ్రరీ సైన్స్ ఉపాధ్యాయుల సమన్వయంతో లైబ్రరీ సైన్స్ పాఠ్యాంశాలను పునరుద్ధరించడం. అన్ని సబ్జెక్టులలో యూజీ స్థాయిలో పాఠ్యాంశాల్లో సమాచార అక్షరాస్యత అంశాన్ని చేర్చి, లైబ్రేరియన్లు దానిని బోధించడానికి సిద్ధంగా ఉండడం రచయితలు, ప్రచురణకర్తల మధ్య వారధిగా ఉండటానికి గ్రంథాలయం భాగంగా ఒక పరిశోధనా మండలి ఏర్పాటు, ప్లాగరిజం వంటి ప్రచురణల పట్ల జాగృతం చేయడానికి లైబ్రరీ సైన్స్ బోధన విభాగాలు, లైబ్రేరియన్లు సంయుక్తంగా వరుస ఓరియంటేషన్ కార్యక్రమాలను నిర్వహణ, లైబ్రేరియన్లు, పరిశోధనా పండితులకు యూజీసీ అందించే తప్పనిసరి సబ్జెక్టుల తో పాటు, సంస్థలోని పరిశోధక విద్యార్థులకు "పరిశోధన, ప్రచురణ నీతి" పై బోధించడానికి ముందుండాలన్నారు. తద్వారా దేశాభివృద్ధికి నైతికంగా నాణ్యమైన పరిశోధన, ప్రచురణలను సరైన స్ఫూర్తితో ఎలా చేయాలో వారికి పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. వీక్షిత్ భారత్ 2047 మూలస్తంభాలను సాధించడానికి ప్రజా గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా విధానాలను రూపొందించడానికి జాతీయ స్థాయి కమిటీ ఏర్పాటు, లైబ్రేరియన్లు ఉచిత లభ్యత ప్రచురణలను 'స్వయం' వంటి ఓపెన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించడానికి చొరవ తీసుకోవడం చేయాలనీ ముక్త కంఠంగా నిర్ణయం తీసుకున్నారు.

ప్రతి ఇంట్లో చెత్తసేకరణ పక్కాగా చేపట్టాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ప్రతి ఇంటి వద్ద తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేయాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉదయం 39వ వార్డు చెన్నారెడ్డి కాలనీ లో కార్పొరేటర్ పునీత, అధికారులతో కలసి పారిశుద్య పనులను కమిషనర్ పరిశీలించారు. చెత్త సేకరణ ప్రతి రోజూ జరుగుతోందా? వాహనం వస్తోందా అని అడిగి తెలుసుకున్నారు. కాగా వర్షాల వలన రోడ్లు చాలా వరకు పాడై పోయాయని, బాగు చేయాలని కార్పొరేటర్, ప్రజలు కమిషనర్ ను కోరారు. పాడై పోయిన రోడ్లను మరమ్మతులు చేయిస్తామని, గుంతలను వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ లు వెంకట ప్రసాద్, శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

అల్పాహారం వితరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద పేదలకు అల్పాహారం లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సంస్థ వారు వితరణ చేశారు. గర్భిణులు, వారి సహాయకులకు రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. అల్పాహార విందు దాతలు దిలీప్, దిలీప్ (ఇద్దరి పేర్లు దిలీప్). లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ మక్కిన భాస్కర్, లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షులు లయన్ బండి మధుసూదన రెడ్డి, కార్యదర్శి లయన్ చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి లయన్ వి పురుషోత్తమ నాయుడు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలను వేసి, కేక్ కట్ చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. రాజభరణాలను రద్దు చేయ డం,14 బ్యాంకులను జాతీయం చేయడం, భూ సంస్కరణలను అమలు పరచి పేదల ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, పేద,బడుగు, బలహీన వర్గాలకు ఇల్లు నిర్మించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, డా రామకృష్ణ రావు, వేమయ్య , బీసీ సెల్ నాయకులు వేంకటసుబ్బరాజు, బ్రాహ్మయ్య పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- సత్యవేడు: మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచు కోవాలని కన్నవరం జెడ్‌పిహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ రవి విద్యార్థులకు టాయిలెట్ వినియోగ ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందిస్తూ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. టాయిలెట్ల వినియోగం, పరిశుభ్రత పై కన్నవరం గ్రామ స్థానికులకు వివరిస్తూ అవగాహన ర్యాలీ విద్యార్థులు నిర్వహించారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయవాహి ని చారిటబుల్ ఫౌండేషన్‌కు ఎంఈఓ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ సిఆర్పి సోనియా వారు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ఎంఈఓ రవి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఎనిమిదో తరగతి యామిని మొదటి బహుమతిని, హాసిని నందకుమార్ రెండవ బహుమతిని, నక్షత్రం, మోహిత్ మూడవ బహుమతిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సురేష్ కుమార్,దామోదరం, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ బృందం పిఓ అరుణ, కృష్ణవేణి, సుప్రియ, సీఆర్పీలు గౌతమి , సోనియా పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే చర్య: ఎంఈవో

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మధ్యాహ్నం భోజనంలో పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఆయన బుధవారం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసు కుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సత్యవేడు: అన్నదాత సుఖీభవ సాయం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం పాల్గొన్నా రు. అనంతరం సత్యవేడు మండల కేంద్రానికి పంచాయతీ రాజ్ నుండి మంజూరైన చెత్త సేకరణ ఆటోలను లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వెంకట రాజుల కండ్రిగ రహదారి వంతెనను పరిశీలించి ఆర్డబ్ల్యూఎస్ ఏడితో ఫోన్ ద్వారా సంభాషించి త్వరగా పని ప్రారంభించాలని సూచించారు. అంతకుముందే ప్రభుత్వ డిగ్రీ కాలేజీని సందర్శించి అక్కడి సమస్యలపై ప్రిన్సిపాల్ తో ఫోన్ ద్వారా సంభాషించి విద్యార్థులు చక్కగా చదువుకునేలా కళాశాలలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రాజశేఖర్, మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమ రావు, వ్యవసాయ అధికారులు మురళి, సంజీవరెడ్డి, శోభారాణి, చిట్టిబాబు, షణ్ముగం, ఏఈఓ ప్రవీణ్, కన్నవరం సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, రమణ, రాజా, రైతులు పాల్గొన్నారు.

నేడు 'కోట'కు

గుండె వైద్య నిపుణుల రాక

సామాన్యులకు తక్కువ ఫీజుకే వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కోట : నెల్లూరు నుండి గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరాం గురువారం (నేడు)కోటకు వస్తున్నట్లు జనతా క్లినిక్ డాక్టర్ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా అతి తక్కువ ఫీజుకే సామాన్యులకు గుండె వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోట లోని ఎన్సీఆర్ నగర్‌లోని స్థానిక జనతా క్లినిక్ ఆసుపత్రికి గురువారం ఉదయం 10 గంటల నుండి మూడు గంటల వరకు గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరాం అందుబాటులో ఉంటారని తెలిపారు. గుండె వ్యాధికి సంబంధించిన లక్షణాలు ఉన్నట్లయితే తక్షణమే డాక్టర్ ను సంప్రదించి సూచనలు,సలహాలను తీసుకోవచ్చు నన్నారు. 500 రూపాయలతో ఈసీజీ, ఫాస్టింగ్ లిపిడ్ ప్రొఫైల్, ఆర్ బి ఎస్, బిపి,2డి ఎకో,కార్డియాలజీ కన్సల్టేషన్ లాంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని గుండె వ్యాధి సంబంధిత లక్షణాలున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.